సాక్షి
రంగారెడ్డి

ఆదివారం । 13 । ఆగస్టు । 2023



మత రాజకీయాలతో ప్రమాదం

దేశానికి గాయాలైతే రాచపుండుగా మారి దేశాన్ని కబళిస్తాయని ప్రముఖ సినీనటుడు ప్రకాష్‌రాజ్ అన్నారు. 8లో▸



ఆర్ట్ ఫెస్టివల్ ప్రారంభం

మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్‌గ్యాలరీలో శనివారం ది హైదరాబాద్ ఆర్ట్ ఫెస్టివల్ ప్రారంభమైంది. 8లో▸

20 వరకు ఎంఎంటీఎస్ రద్దు

సాక్షి, సిటీబ్యూరో: ట్రాక్ నిర్వహణ, మరమ్మతుల కారణంగా ఎంఎంటీఎస్ సర్వీసులను ఈ నెల 14 నుంచి 20 వరకు రద్దు చేయనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. లింగంపల్లి–నాంపల్లి, ఉందానగర్–లింగంపల్లి, ఫలక్‌నుమా– లింగంపల్లి, రామచంద్రాపురం– ఫలక్‌నుమా మధ్య సర్వీసులు రద్దు కానున్నాయి.

న్యూస్‌రీల్

తెలంగాణ పునర్నిర్మాణం జరిగినప్పుడే అసలైన నివాళి

గద్దర్ సంస్మరణ సభలో వక్తలు



గద్దర్‌కు నివాళి అర్పిస్తున్న వక్తలు

తుర్కయంజాల్: తెలంగాణ పునర్నిర్మాణం జరిగినప్పుడే గద్దర్‌కు ఘనమైన నివాళి అని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి అన్నారు. పూర్వ హయత్‌నగర్ మండల టీజేఏసీ ఆధ్వర్యంలో తుర్కయంజాల్‌లోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ప్రజాయుద్ధ నౌక గద్దర్ సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గద్దర్ రాసిన 1,200 పాటలను ఇంగ్లిష్‌లోకి తర్జుమా చేయాలని, హైదరాబాద్‌లో గద్దర్ సమాధి, పాటల లైబ్రరీ, మ్యూజియం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 25 ఏళ్ల పాటు వెన్నులో బుల్లెట్ ఉన్న, ఎన్నో ఆరోగ్య సమస్యలు వేధిస్తున్నా నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ, ఆటపాటలతో ప్రజలను అలరించి, వారి గుండెల్లో గద్దర్ స్థానం సంపాదించుకున్నారని అన్నారు. అనంతరం ఉషోదయ కళాబృందం కళాకారులు గద్దర్‌కు పాటలతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా రైతుబంధు అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు క్యామ మల్లేశ్, తుర్కయంజాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు, కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్‌లు కోశిక ఐలయ్య, రమావత్ కళ్యాణ్ నాయక్, కడారి శ్రీలత, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

మంద నుంచి 60 గొర్రెలు చోరీ

చేవెళ్ల: గొర్రెల మంద నుంచి 60 గొర్రెలను అపహరించిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని అల్లావాడలో చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లావాడ గ్రామానికి చెందిన మిట్టకొరి మాణయ్య 30 ఏళ్లుగా గొర్రెల పెంపకంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎప్పటి మాదిరిగానే శుక్రవారం గొర్రెలు మేపుకొని వచ్చి రాత్రి మందలో కట్టి ఇంటికి వెళ్లాడు. ఇదే అదనుగా గుర్తు తెలియని వ్యక్తులు మందలో నుంచి 60 గొర్రెలను ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం మంద వద్దకు వచ్చిన మాణయ్యకు గొర్రెలు తక్కువగా కనిపించాయి. మందకు వేసిన ఫెన్సింగ్ వెనక వైపు కట్ చేసి ఉంది. దీంతో చోరీ జరిగిందని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దాదాపు రూ.4 లక్షల వరకు నష్టం జరిగిందని వాపోయాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొక్కలు నాటి.. సెల్ఫీ దిగి..



నిమ్స్‌లో మొక్క నాటి సెల్ఫీ దిగుతున్న నిమ్స్ డైరెక్టర్ బీరప్ప తదితరులు

లక్డీకాపూల్ : నిమ్స్ ఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటిన డైరెక్టర్ డాక్టర్ ఎన్. బీరప్ప సెల్ఫీ దిగి పలువురికి స్ఫూర్తినిచ్చారు. ఎంపీ జోగినిపల్లి సంతోష్ కుమార్ ప్రారంభించిన గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా శనివారం నిమ్స్‌లో వైద్య బృందం మొక్కలు నాటింది. కార్యక్రమంలో డీన్ లిజా రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ నిమ్మ సత్యనారాయణ, ఈఆర్ శాంతివీర్, పీఆర్‌ఓ సత్యగౌడ్, ఆర్‌ఎంఓలు పాల్గొన్నారు.

ఘాటెక్కుతున్న ఉల్లి



పెద్దేముల్: కోయకుండానే ఉల్లి కన్నీళ్లు తెప్పిస్తోంది. వంటింట్లో ఏ కూర వండాలన్నా.. ఉల్లి తప్పనిసరి కావడంతో అది ఎంత ఘాటెక్కినా ఖరీదు చేయక తప్పదు. ప్రస్తుతం టమాటాకు ఏమీ తక్కువ కాదన్నట్లు ఉల్లి, వెల్లుల్లి ధర భగ్గుమంటోంది. రెండు నెలల క్రితం క్వింటాకు రూ.800 నుంచి రూ.1,000 పలకగా.. ప్రస్తుతం రూ.2 వేలు దాటి, క్రమంగా టమాటా సరసన చేరుతోంది. టోకున ఇలా ఉండగా.. చిల్లర దుకాణాల్లో కిలో రూ.30 నుంచి రూ.40 వరకు విక్రయిస్తున్నారు. కొత్త ఉల్లి వచ్చే వరకు ధర ఇంకా పెరగొచ్చని వ్యాపారులు చెబుతున్నారు.

వారేనా.. వారసులా?



వచ్చే ఎన్నికల బరిలో నిలిచేదెవరో..

- సిట్టింగ్‌లకే టికెట్ అంటున్న అధిష్టానం
- రాజకీయ వారసత్వంపై ఎమ్మెల్యేల తర్జనభర్జన
- వ్యక్తిగతంగా రహస్య సర్వేలు
- ఎవరు పోటీచేస్తారోనని కేడర్‌లో అయోమయం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు బయటే కాదు.. ఇంటి గుబులు కూడా పట్టుకుంది. అప్పుడే క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకోవడం ఇష్టం లేకపోయినా.. పిల్లల రాజకీయ భవితవ్యం దృష్ట్యా పునరాలోచనలో పడ్డట్లు తెలుస్తోంది. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో సీనియర్లను మార్చి తలనొప్పులు తెచ్చుకునేకంటే తిరిగి సిట్టింగ్‌లకే అవకాశం ఇవ్వడం ఉత్తమమని అధిష్టానం అభిప్రాయపడుతున్నట్లు సమాచారం. అధికార పార్టీ అధినేత ఇటీవల పలు వేదికల్లో ఇదే అంశాన్ని ప్రస్తావించిన విషయం తెలిసిందే. దీంతో సిట్టింగ్‌లకు తమ వారసుల రాజకీయ భవితవ్యంపై ఆందోళన నెలకొంది. మరోవైపు బరిలో ఎవరు ఉంటారోనని కేడర్‌లో అయోమయం నెలకొంది.

దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకునేలా..

1985 నుంచి వరుసగా చేవెళ్ల నియోజకవర్గం నుంచి పటోళ్ల ఇంద్రారెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందుతూ వచ్చారు. 1999లో ఆయన అకాల మరణం తర్వాత రాజకీయ వారసురాలిగా సతీమణి, ప్రస్తుత విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి రాజకీయ రంగప్రవేశం చేశారు. 2000 సంవత్సరంలో చేవెళ్ల నియోజకవర్గానికి నిర్వహించిన ఉప ఎన్నికలో విజయం సాధించారు. 2004లోనూ అదే స్థానం నుంచి గెలుపొందారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా చేవెళ్ల ఎస్సీకి రిజర్వ్ కావడంతో 2009లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. 2018లో ఇదే స్థానం నుంచి మళ్లీ గెలుపొందారు. 2014లో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో కుమారుడు కార్తీక్‌రెడ్డి కోసం సీటునే త్యాగం చేశారు. అప్పట్లో చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయించగా ఆయన ఓటమి పాలయ్యారు. మళ్లీ పోటీ చేయాలని భావించినా అవకాశం రాకపోవడంతో ఆగిపోయారు. ప్రస్తుతం తల్లికి చేదోడువాదోడుగా ఉంటూ తెరవెనుక అన్నీ తానై వ్యవహరిస్తున్నారు. ఇటు మహేశ్వరంతో పాటు, అటు రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో తరచూ పర్యటిస్తూ.. రాజకీయంగా తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఎప్పటికప్పుడు వ్యక్తిగత సర్వేలు చేయించుకుంటున్నట్లు తెలిసింది. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలనే భావనతో.. తల్లి అధికారంలో ఉండగానే.. తన రాజకీయ భవితవ్యానికి గట్టి పునాదులు వేసుకోవాలనే కృతనిశ్చయంతో ఉన్నట్లు సమాచారం. 2023 ఎన్నికల్లో ఏదో ఒక స్థానం నుంచి పోటీ చేయించాలని మంత్రి సైతం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే అధిష్టానాన్ని ఒప్పించి, ఇద్దరూ చెరో నియోజకవర్గం నుంచి పోటీ చేస్తారా? లేక ఒకరి కోసం మరొకరు మళ్లీ త్యాగం చేసుకుంటారా? అనేది వేచి చూడాలి.

'పట్నం'లో తండ్రా.. కొడుకా..?

ఇబ్రహీంపట్నం నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి 2009, 2014, 2018 ఎన్నికల్లో వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. తన తర్వాత కుమారుడు ప్రశాంత్‌రెడ్డికి రాజకీయ అవకాశం కల్పించాలని భావించారు. ఈ మేరకు ఇప్పటికే క్రియాశీల రాజకీయాల్లోకి తీసుకొచ్చారు. గతంలో జీహెచ్‌ఎంసీ నుంచి కార్పొరేటర్‌గా పోటీ చేయించి గెలిపించారు. తర్వాత తండ్రి వెన్నంటే ఉంటున్న ఆయన ఇటీవల ప్రగతి నివేదన సభల పేరుతో నియోజకవర్గం మొత్తం పాదయాత్ర చేశారు. ఈ క్రమంలో వచ్చే ఎన్నికల్లో బరిలోకి దిగుతారన్న చర్చ జరుగుతోంది. ఇద్దరిలో ఎవరు పోటీ చేస్తే బాగుంటుందనే అంశంపై ఇప్పటికే అంతర్గత సర్వేలు చేయించుకున్నట్లు తెలిసింది. మరో వైపు వ్యక్తిగతంగానే కాకుండా ఆర్థిక, రాజకీయ, సామాజిక సమీకరణాల్లో భాగంగా ఈసారి తనకే టికెట్ లభిస్తుందని సీనియర్ నేత క్యామ మల్లేశ్ సైతం చెప్పుకొంటుండటం కొసమెరుపు.

షాద్‌నగర్ నుంచి మళ్లీ ఆయనే..!

షాద్‌నగర్ సిట్టింగ్ ఎమ్మెల్యే ఎల్లనమోని అంజయ్య యాదవ్ సైతం రాజకీయ వారసత్వంపై తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. కేశంపేట ఎంపీపీ, జెడ్పీటీసీగా, షాద్‌నగర్ నియోజకవర్గం నుంచి 2014, 2018లో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయనకు పార్టీ కేడర్‌లో మంచి ఇమేజ్ ఉంది. ప్రస్తుతం వయోభారానికి తోడు ఆరోగ్య సమస్యలు ఆయన్ను వెంటాడుతున్నాయి. తన తర్వాత రాజకీయ వారసత్వాన్ని తన కుమారుడికి ఇవ్వాలని భావించినట్లు సమాచారం. ఈ మేరకు పెద్దకుమారుడు రవీందర్ యాదవ్‌ను వచ్చే ఎన్నికల్లో బరిలోకి దింపాలని భావించారని, అధిష్టానం ఇందుకు సుముఖంగా లేకపోవడంతో ఆ నిర్ణయం నుంచి విరమించుకుని మళ్లీ తానే పోటీకి సిద్ధపడుతున్నట్లు తెలిసింది. పెద్దకుమారుడు ప్రస్తుతం కేశంపేట ఎంపీపీగా, పెద్ద కోడలు ఎక్లాస్‌ఖాన్‌పేట సర్పంచ్‌గా ఉన్నారు. చిన్న కుమారుడు మురళీ కృష్ణయాదవ్ ఇంటి వ్యవహారాలు, ఇతర వ్యాపారాలు చూసుకుంటున్నారు. ఇక మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ, బీజేపీ సీనియర్ నాయకుడు జితేందర్‌రెడ్డి సైతం తన కుమారుడు మిథున్‌రెడ్డిని షాద్‌నగర్ నుంచి పోటీ చేయించాలని చూస్తున్నారు. అధిష్టానం ఇందుకు అంగీకరిస్తుందా లేదా వేచి చూడాలి.



కందుకూరు: అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి సబితారెడ్డి

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

- మంత్రి సబితారెడ్డి

కందుకూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను ఆచరణలో అమలు చేసి చూపుతున్న గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి కొనియాడారు. మండలంలోని బండమీద గూడూరులో శనివారం అంబేడ్కర్ సంఘం నాయకులు భాస్కర్, పారిజాత, బాబయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలను మంత్రి ఆవిష్కరించారు. మాలగూడూరులో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం సమాజంలో మార్పు తేవడానికి ఎంతో కష్టపడ్డారని, వారి ఆశయాలు ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వంలో నెరవేరుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టడంతో పాటు 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. దళితులు ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో దళిత బంధు పథకం తెచ్చారని, రాష్ట్రంలో ఉన్న 17 లక్షల దళిత కుటుంబాలకు పథకం అందిస్తామన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేలా సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, స్థానిక సర్పంచ్ శ్రీలత, ఎంపీటీసీ ఎస్.ఎల్లారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చిర్ర సాయిలు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్‌రెడ్డి, సీనియర్ నాయకులు కాకి దశరథ, ఎ.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పఠనమే భవితకు పునాది

బడంగ్‌పేట్: స్మార్ట్‌ఫోన్ల మాయాజాలంలో పడి నేటి యువత పఠనానికి దూరం అవుతోందని, పఠనమే భవిష్యత్తుకు పునాది అని గుర్తుంచుకోవాలని విద్యాశాఖమంత్రి సబితారెడ్డి అన్నారు. బడంగ్‌పేటలోని జిల్లా గ్రంథాలయంలో శనివారం గ్రంథపాలకుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సరస్వతి విగ్రహంతోపాటు గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఇంటర్నెట్ డిజిటలైజేషన్ సెక్షన్, సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పఠనం ఎంత శ్రద్ధగా చేస్తే పరిజ్ఞానం అంత వృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ పారిజాత, మీర్‌పేట్ మేయర్ దుర్గా దీప్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ కిటకిట

శంషాబాద్ : పదిహేను రోజులుగా శంషాబాద్ విమానాశ్రయం కిటకిటలాడుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రధానంగా డిపార్చర్ టెర్మినల్ వద్ద ట్రాఫిక్ జామ్ నిత్యకృత్యంగా మారుతోంది. ఉన్నత చదువుల కోసం విదేశాల బాటపడుతున్న విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు పలికేందుకు వచ్చే బంధుగణం, స్నేహితులతో ఇలా కిక్కిరిసిపోతోంది. టెర్మినల్ ప్రాంతం ఇసుకేస్తే రాలనంత జనంతో నిండిపోతోంది.



10 రోజులు..

రూ.14,324 కోట్లు

- సర్కార్ ఖజానాకు భారీ ఆదాయాన్నిచ్చిన హెచ్‌ఎండీఏ
- కోకాపేట్ నియో పోలిస్ భూములపై రూ.3,319 కోట్లు
- బుద్వేల్ భూముల ద్వారా రూ.3,625.73 కోట్లు
- ఔటర్‌రింగ్ రోడ్డు లీజు మొత్తం రూ.7,380 కోట్లు
- తాజాగా లీజు మొత్తాన్ని చెల్లించిన ఐఆర్‌బీ

సాక్షి, సిటీబ్యూరో: భూముల అమ్మకాలు, ఔటర్ లీజు రూపంలో ప్రభుత్వానికి పది రోజుల్లో ఏకంగా రూ.14,324 కోట్ల ఆదాయం సమకూరింది. జీఓ 111 రద్దు అనంతరం రియల్ భూమ్ పడిపోయిందనుకుంటున్న తరుణంలో హెచ్‌ఎండీఏ వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో రియల్ ఎస్టేట్ దిగ్గజ సంస్థలు పోటాపోటీగా పాల్గొన్నాయి. దీంతో హెచ్‌ఎండీఏకు భారీఎత్తున ఆదాయం లభించింది. ఈ నెల మొదటి వారంలో కోకాపేట్‌లోని నియోపోలిస్ రెండో దశ భూములకు నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో 45.33 ఎకరాలపై ఏకంగా రూ.3,319.60 కోట్ల ఆదాయం లభించింది. అనూహ్యంగా ఎకరం రూ.100 కోట్లకుపైగా అమ్ముడు కావడం సంచలనంగా మారింది. కోకాపేట్‌లో సగటున ఎకరం రూ.73.23 కోట్ల చొప్పున విక్రయించగా, బుద్వేల్‌లో సగటున ఎకరం రూ.36.25 కోట్ల చొప్పున విక్రయించారు. బుద్వేల్‌లో మొత్తం 100.01 ఎకరాలపై ప్రభుత్వానికి రూ.3,625.73 కోట్లు ఆదాయం లభించింది.

- ఔటర్‌రింగ్ రోడ్డు లీజును దక్కించుకున్న ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థ తాజాగా రూ.7,380 కోట్లను ఏకమొత్తంగా హెచ్‌ఎండీఏకు చెల్లించింది. దీంతో పది రోజుల్లోనే సుమారు రూ.14,324 కోట్లకు పైగా ఆదాయాన్ని హెచ్‌ఎండీఏ సమకూర్చింది. మరోవైపు మోకిల, షాబాద్‌లో విక్రయించిన ప్లాట్‌లపైనా రియల్ ఎస్టేట్ వర్గాలు, మధ్యతరగతి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ నెలలో మేడ్చల్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోని మరిన్ని భూములను విక్రయించేందుకు తాజాగా నోటిఫికేషన్ విడుదల చేశారు. వచ్చే నెల రోజుల్లో మరో రూ.వెయ్యి కోట్ల వరకు ఆదాయం లభించే అవకాశం ఉన్నట్లు హెచ్‌ఎండీఏ అధికారులు అంచనా వేస్తున్నారు.

ఇక 'ఐఆర్‌బీ' ఔటర్..

హైదరాబాద్ నగరం చుట్టూ మణిహారంలా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఔటర్ రింగ్‌రోడ్డు ఐఆర్‌బీ ఖాతాలో చేరిపోయింది. లీజు ఒప్పందం ప్రకారం రూ.7,380 కోట్లను ఐఆర్‌బీ సంస్థ శుక్రవారం అర్ధరాత్రి హెచ్‌ఎండీఏకు చెల్లించింది. టోల్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (టీఓటీ) పద్ధతిలో ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థ 158 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు లీజును దక్కించుకున్న సంగతి తెలిసిందే. 30 ఏళ్ల పాటు లీజు కొనసాగనుంది. సెప్టెంబరు 24 వరకు టెండర్ మొత్తాన్ని చెల్లించేందుకు గడువు ఉన్నప్పటికీ ఆగస్టులోనే చెల్లించడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో ఇప్పటి వరకు హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలోని హెచ్‌జీసీఎల్ నిర్వహణలో ఉన్న ఔటర్ శుక్రవారం అర్ధరాత్రి నుంచే ఐఆర్‌బీ అనుబంధ ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వే ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహణలోకి వెళ్లినట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు.

- ఆది నుంచీ వివాదాస్పదంగా మారిన ఔటర్ లీజు వ్యవహారంలో అధికారులు చివరి నిమిషం వరకు గోప్యతను పాటించారు. టెండర్ నిబంధనల మేరకు లీజు మొత్తాన్ని ఒకేసారి చెల్లించాల్సి ఉండడంతో లీజు సొమ్ము చేతికి అందే వరకు బయటికి రాకుండా అధికారులు జాగ్రత్తలు పాటించారు. నానక్‌రాంగూడలోని హెచ్‌జీసీఎల్ కార్యాలయంలో ఎంతో జాగ్రత్తగా లీజు ప్రక్రియను పూర్తి చేశారు. దీంతో ఇప్పటి వరకు హెచ్‌జీసీఎల్ పక్షాన టోల్ వసూలు చేసిన ఈగిల్ ఇన్‌ఫ్రా నుంచి ఐఆర్‌బీ గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌వేకు టోల్ వసూలు నిర్వహణ బదిలీ అయింది.
- 158 కిలోమీటర్ల ఔటర్ మార్గంలో 121కి పైగా టోల్‌గేట్లు ఉన్నాయి. ప్రతి రోజు లక్షకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. కొంతకాలంగా ఔటర్‌పై వాహనాల రాకపోకలు గణనీయంగా పెరిగాయి. ప్రతి నెలా సుమారు రూ.550 కోట్ల వరకు టోల్ రూపంలో ఆదాయం వస్తోంది. ఇకనుంచి ఈ మొత్తం ఐఆర్‌బీ ఖాతాలోకి వెళ్లనుంది. మరోవైపు భవిష్యత్తులో వాహనాల సంఖ్య పెరగనున్న దృష్ట్యా టోల్ ఆదాయం కూడా భారీగా పెరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇక నుంచి ఔటర్ రింగురోడ్డులోని 8 లేన్‌ల నిర్వహణ, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలు ఐఆర్‌బీ పరిధిలో ఉంటాయి. ఔటర్‌పై పచ్చదనం, సర్వీస్ రోడ్ల తదితర అంశాలు హెచ్‌జీసీఎల్ పరిధిలో ఉండనున్నాయి.

గొలుసు దొంగలు దొరికారు

- నలుగురు చైన్ స్నాచర్ల అరెస్టు
- రూ.10.50 లక్షల విలువైన బంగారం, రెండు బైక్‌లు, ఆటో స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రాచకొండ క్రైం డీసీపీ అరవిందబాబు



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ పోలీసు కమిషనరేట్ క్రైం డీసీపీ అరవిందబాబు

ఇబ్రహీంపట్నం: ఒంటరి మహిళలను టార్గెట్ చేసి రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల పరిధిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న నలుగురితో కూడిన ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు, అడిషనల్ క్రైం డీసీపీ శ్రీనివాసుతో కలిసి ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచకొండ క్రైం డీసీపీ వి.అరవిందబాబు వివరాలు వెల్లడించారు.కర్మన్‌ఘాట్‌కు చెందిన ఆటోడ్రైవర్ మునావత్ రమేష్ (26), నేరేడిగూడెంకు చెందిన పెయింటింగ్ వర్కర్ నేనావత్ దాసు నాయక్ (23), చాంద్రాయణగుట్టకు చెందిన లేబర్ వర్కర్ నేనావత్ రవి(23), నల్లగొండ జిల్లా పెద్ద అడిసెపల్లికి చెందిన మునావత్ నరేష్(23) ముఠాగా ఏర్పడ్డారు. వీరిలో ముగ్గురు బంధువులు కాగా రవికి దాసు స్నేహితుడు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు చైన్‌స్నాచింగ్‌లను ఎంచుకొన్నారు. ఒంటరిగా ఉండే మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకొని వారి మెడలోని బంగారు గొలుసులను లాక్కొని కొంతకాలంగా చోరీలకు పాల్పడుతున్నారు. మాడ్గుల పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు, నల్లగొండ జిల్లా చింతపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు, కనగల్ పీఎస్ పరిధిలో ఒక దోపిడీకి పాల్పడ్డారు. ఇద్దరు బైక్‌పై, లేదా ఆటోలో ఉండి మరో ఇద్దరు బంగారు గొలుసులు అపహరించి పరిగెత్తుకుంటూ వచ్చి ఆయా వాహనాలపై పరారవుతున్నారు. పథకం ప్రకారం మాడ్గుల పీఎస్ పరిధిలోని న్యూ బ్రాహ్మణపల్లి క్రాస్ రోడ్డు వద్ద శనివారం నిందితులను పట్టుకొని విచారించగా నేరం అంగీకరించారు. వారి నుంచి రూ.10.50లక్షల విలువైన 98 గ్రాముల బంగారం, ఒక ప్యాసింజర్ ఆటో, రెండు బైక్‌లు, రూ.3,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్, మహేశ్వరం జోన్ డీసీపీ శ్రీనివాస్ పర్యవేక్షణలో సీసీఎస్ ఎల్‌బీనగర్ క్రైం అడిషనల్ డీసీపీ ఎం.శ్రీనివాసులు, ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, సైదులు, సురేష్‌కుమార్, విజయ్‌కుమార్, సత్యనారాయణ, రవికుమార్, యాదయ్య, మాడ్గుల సీఐ రాజశేఖర్‌తో కూడిన బృందం వ్యూహం ప్రకారం నిందితులను పట్టుకున్నారు. నిందితులను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని రాచకొండ కమిషనర్ చౌహాన్ అభినందించారు.

ప్రభుత్వానిది 'రియల్' దందా

- హెచ్‌ఎండీఏను అడ్డుపెట్టుకొని బ్రోకరిజం చేస్తోంది
- పేదల భూములు లాక్కొని పెద్దలకు కట్టబెడుతోంది
- జాతీయ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి



రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న కోదండరెడ్డి తదితరులు

షాబాద్: నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన రైతుల పొలాలను ప్రభుత్వం అతి తక్కువ ధరకు లాక్కొని బడా కంపెనీలకు అప్పగించి రియల్ దందా కొనసాగిస్తోందని జాతీయ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి విమర్శించారు. మండల పరిధిలోని చందనవెల్లి భూబాధితులతో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వహణ సభ్యుడు పామెన భీంభరత్, రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కార్యదర్శులు సురేందర్‌రెడ్డి, రాంరెడ్డి, డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకట్‌స్వామి, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్, మెంబర్ షాబాద్ దర్శన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఆగిరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ.. ప్రజా అవసరాల పేరుతో ప్రభుత్వమే రియల్ వ్యాపారం సాగిస్తోందని, హెచ్‌ఎండీఏను అడ్డుపెట్టుకొని బ్రోకరిజం సాగిస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే రూ. 24 లక్షల పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన రైతుల నుంచి స్వాధీనం చేసుకొని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టిందని ఆరోపించారు. ధరణి పేరుతో అసైన్డ్ సీలింగ్ భూములను సైతం నిషేధిత జాబితాలో ఉంచి పేదలను మోసం చేస్తోందని పేర్కొన్నారు. భూములు కోల్పోయిన బాధితులకు పూర్తిస్థాయి నష్టపరిహారం ఇవ్వకపోవడంపై చందనవెల్లి గ్రామానికి చెందిన నీరటి ఆంజనేయులు సాక్షాత్తు అసెంబ్లీ ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించిన ఉదంతం వెలుగులోకి వచ్చినప్పటికీ ప్రభుత్వం కప్పిపుచ్చడానికి ప్రయత్నించిందని ఆరోపించారు. బాధితులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు మధుసూదన్‌గుప్తా, సీనియర్ నాయకుడు సున్నపు వసంతం, పార్టీ ప్రధాన కార్యదర్శి పామెన భార్గవరామ్, చేవెళ్ల నియోజక వర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శేరి పెంటారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పించడమే సెట్విన్ లక్ష్యం



బంజారాహిల్స్: రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ సెట్విన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యదర్శి సబ్యసాచి ఘోష్ అన్నారు. సెట్విన్ మేనేజింగ్ డైరెక్టర్ కె వేణుగోపాలరావు ఆధ్వర్యంలో నిర్వహించిన స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా సెట్విన్ సంస్థ కూడా ఉద్యోగాలు కల్పిస్తోందన్నారు. అనంతరం సబ్యసాచి ఘోష్‌తోపాటు ఎమ్మెల్సీ మీర్జా రియాజ్ ఉల్ హసన్‌లు డిప్లొమా హోల్డర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అలాగే సంస్థలో శిక్షణ పొంది దేశ విదేశాల్లో స్థిరపడిన యువతీ యువకులకు ప్రోత్సాహక సర్టిఫికెట్లను అందించారు. యువజన సర్వీసుల శాఖ సంచాలకులు డాక్టర్ వాసం వెంకటేశ్వర్లు, సెట్విన్ ఎకౌంట్స్ ఆఫీసర్ ఓం ప్రకాష్, మేనేజర్ ఎంఏ మోయిజ్, సూపరింటెండెంట్ పెండ్యాల ప్రసాద్ రావు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెట్విన్‌పై రూపొందించిన డాక్యుమెంటరీని ఆవిష్కరించారు.

కుల, మత రాజకీయాలు ప్రమాదకరం

సినీ నటుడు ప్రకాష్‌రాజ్



సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం లోగోను ఆవిష్కరిస్తున్న ప్రకాష్‌రాజ్

సుందరయ్య విజ్ఞానకేంద్రం: శరీరానికి గాయాలైతే మౌనంగా ఉన్నా మానిపోతాయి. కానీ అదే దేశానికి గాయాలైతే రాచపుండుగా మారి దేశాన్ని కబళిస్తాయని ప్రముఖ సినీనటుడు ప్రకాష్‌రాజ్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం' ఆవిర్భావ సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రకాష్‌రాజ్ మాట్లాడుతూ మనం వెళ్తున్న దారిలో రక్తం ఉందని, దాని గురించి రాయాల్సిన బాధ్యత రచయితలు, కవులపై ఉందన్నారు. పార్లమెంటులో మన ప్రజాప్రతినిధుల మధ్య మాటల గారడీ జరిగింది తప్ప మరేమీ లేదన్నారు. వందల రోజులుగా మణిపూర్ మండుతుంటే మన స్టేషన్ మాస్టర్ ప్రధానమంత్రి మోదీ పట్టించుకోవడం లేదన్నారు. జోకర్లను లీడర్లుగా చేస్తే మనం చూసేది సర్కస్ మాత్రమే అని ఎద్దేవా చేశారు. మతం, కులం పేరిట జరిగే రాజకీయాలు దేశానికి చాలా ప్రమాదకరమని, వాటిని వదిలించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. సామాజిక కార్యకర్త, విశ్రాంత ఆచార్యులు పద్మజా షా మాట్లాడుతూ దేశంలో ప్రశ్నించే గొంతుల్ని అణచివేయడానికి సాధనాలుగా న్యాయ వ్యవస్థతో సహ రాజ్యాంగ బద్ధమైన అన్ని వ్యవస్థలను ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బంగ్యా భూక్యా, సీనియర్ జర్నలిస్టు మిర్ అయాబ్‌అలీఖాన్, కె.శ్రీనివాస్, రచయిత యాఖూబ్, డాక్టర్ పసునూరి రవీందర్, కాత్యాయని విద్మహే, స్కైబాబా, జ్వాలిత, నరేష్‌కుమార్ సూఫీ, నాలేశ్వరం శంకరం, సుంకిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హింసకు గురయ్యేది అణగారిన వర్గాలే

సాక్షి సిటీబ్యూరో: కులం, మతం వ్యత్యాసాలతో హింసకు గురయ్యేది అణగారిన వర్గాలేనని జర్మనీ భారత మాజీ రాయబారి వినోద్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం నగరంలోని అంబేద్కర్ రిసోర్స్ సెంటర్‌లో దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో 'స్వతంత్ర భారతంలో కులం-మతం-హింస' అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మత కలహాలు సృష్టించే రాజకీయ పార్టీలకు తావివ్వద్దని, ఆజ్యం పోసి లబ్ధిపొందేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తాయని ఆరోపించారు. ఇతర దేశాలకు మన దేశానికి చాల వ్యత్యాసాలు ఉన్నాయని, అక్కడ పుట్టగానే అందరూ సమానులైతే.. ఇక్కడ మాత్రం అనేక వ్యత్యాసాలుంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ తేడా వలనే హింస రూపం దాల్చుతుందని, దానిని రాజకీయ పార్టీలు ఉపయోగించుకుంటాయన్నారు. పాలకపక్షాలు హింస ద్వారా వ్యత్యాసాలు తీసుకొస్తాయని, గతంలో గుజరాత్,ప్రస్తుతం మణిపూర్ లాంటి ఘటనలు ఎన్నికల ముందు చేసే దుశ్చర్యన్నారు. వక్తలు సూరేపల్లి సుజాత, పీఎస్ఎన్‌మూర్తి మాట్లాడుతూ మతాన్ని పాజిటివ్‌గా చూడకుండా హింసను ప్రేరేపిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత స్త్రీ శక్తి జాతీయ కన్వీనర్ అధ్యక్షత వహించిన సదస్సులో వక్తలు కల్పన, సజయ బిషప్ బాస్కర్, శంకర్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న వక్త

ఆర్ట్ గ్యాలరీలో ది హైదరాబాద్ ఆర్ట్ ఫెస్టివల్ ప్రారంభం

మాదాపూర్: కళాకారులు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయని కావ్య కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ఆర్ట్‌గ్యాలరీలో శనివారం ది హైదరాబాద్ ఆర్ట్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కళాకారులు తమ మదిలోని బావాలను చిత్ర రూపంలో గీయగలరని కొనియాడారు. కళాకారులు వేసిన చిత్రాలకు వందల అర్థాలు దాగి ఉంటాయన్నారు. ఈ ప్రదర్శన ఈనెల 21వ తేదీ వరకు కొనసాగనున్నట్టు క్యూరేటర్ పి.జె స్టాలిన్ తెలిపారు. ప్రదర్శనలో 70 మంది కళాకారులు వేసిన 100 చిత్రాలను ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు కొనసాగనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు రమణారెడ్డి, కళాకారులు సుప్రజారెడ్డి, పద్మప్రియ, శాలిని, ఆశ తదితరులు పాల్గొన్నారు.



ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న కావ్యకిషన్‌రెడ్డి తదితరులు





ఆకట్టుకుంటున్న చిత్రాలు

స్ప్రింట్ డయాగ్నస్టిక్స్ మొబైల్ యాప్ ప్రారంభం

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36లోని స్ప్రింట్ డయాగ్నస్టిక్స్‌లో వినియోగదారుల సౌకర్యార్థం సంస్థ రూపొందించిన అధునాతన మొబైల్ యాప్‌ను శనివారం రాష్ట్ర ఐటీ సెక్రటరీ జయేష్ రంజన్ ప్రారంభించారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఒకే స్వైప్‌తో స్ప్రింట్ యొక్క మొత్తం సేవలు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం అన్నారు. ఆరోగ్య సంరక్షణ రంగం డిజిటల్ పరివర్తన దిశగా వెళ్తున్నదని తమ ప్రభుత్వం డిజిటల్‌సేవలను ఎక్కువగా వినియోగించేలా ప్రోత్సహిస్తున్నదన్నారు. ఆరోగ్య సంరక్షణ, సాంకేతిక సంస్థలకు మద్దతు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో మమతా వేగుంట, స్ప్రింట్ డయాగ్నస్టిక్స్ సీఎండీ డాక్టర్ అనిల్ కృష్ణ, శరత్‌రెడ్డి, సీవోవో కృష్ణ చైతన్య, పాల్గొన్నారు.



మొబైల్ యాప్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఐటీ సెక్రటరీ జయేష్ రంజన్